నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 17 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

సీఎం మీటింగ్‌కు కలెక్టర్ | ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంత్ కె. జెండగే మీటింగ్‌లో పాల్గొన్న దృశ్యమిది.

వానల్లేవ.. చెరువుల్లో నీళ్లు లేవ్

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు | **అంతటా కరువు ఛాయలు**

జిల్లాలో తీవ్ర వర్షభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాకాలంలోనూ సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. వానలు లేక కరువుఛాయలు కనిపిస్తున్నాయి. చెరువుల్లో నీళ్లు లేక బీడువారిపోయాయి. అసలు ఈ ఏడాది చెరువుల్లోకి నీరు చేరని పరిస్థితి ఉంది. ఇంకో వైపు వాగులు, వంకలు వట్టిపోయాయి. వర్షాలు, నీరు లేక వ్యవసాయ పనులు కూడా ముందుకు సాగడం లేదు. దాంతో రైతుల సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

– యాదాద్రి భువనగిరి, జూలై 16 (నమస్తే తెలంగాణ)

- అనేక చెరువుల్లో నీటి నిల్వలు 25శాతంలోపే
- చెక్‌డ్యామ్‌లు, వాగులు, వంకల్లో కనిపించని నీటి జాడ
- వర్షాల్లేక లోటు వర్షపాతం నమోదు
- ముందుకు సాగని వ్యవసాయ పనులు
- జిల్లాలో ఇప్పటి వరకు 35శాతమే సాగు
- ఆందోళనలో అన్నదాత.. పరిస్థితి అగమ్యగోచరం

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సొంత గ్రామం యాదగిరిగుట్ట మండలం సైదాపురంలోని చెరువు దుస్థితి

లోటు వర్షపాతం

జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.8 సెంటీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేయగా, మంగళవారం వరకు 16 సెంటీమీటర్లు మాత్ర మే రికార్డయ్యింది. అనేక మండలాల్లో లోటు వర్షపాతమే ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆత్మకూర్ (ఎం) మండలంలో 43శాతం, చౌటుప్పల్‌లో 30శాతం, గుండాలలో 29శాతం, యాదగిరిగుట్టలో 24శాతం తక్కువ వర్షాలు కురిశాయి. ఇంకా అనేక మండలాలు లోటు వర్షపాతానికి అతి దగ్గరలో ఉన్నాయి. వర్షాలు లేక ప్రజలు బొడ్రాయిలకు జలాభిషేకాలు చేస్తున్నారు. కప్పలకు పెళ్లిలు చేస్తున్నారు. వర్షాలు పడాలని కాముడు, బతుకమ్మ ఆడుతున్నారు.

అడుగంటుతున్న చెరువులు

జిల్లాలో సుమారు 900 వరకు చెరువులు ఉన్నాయి. వీటిల్లో దాదాపు అన్ని కూడా ఎండిపోయే దశకు వచ్చాయి. అనేక చోట్ల చుక్క నీరు కూడా లేదు. మొత్తంగా పరిశీలిస్తే సగటున జిల్లాలోని చెరువుల్లో 25శాతం నీళ్లు కూడా లేవు. ఈ సీజన్‌లో అసలు చెరువుల్లోకి నీళ్లు చేరేంత వర్షాలు పడలేదు. ఇప్పుడున్న నీళ్లు కూడా గతేడాది నింపినవే కావడం గమనార్హం. భువనగిరి, బీబీనగర్, సంస్థాన్ నారాయణపురం, యాదగిరిగుట్ట, రామన్నపేట తదితర పెద్ద చెరువులన్నీ ఎండిపోయే దశకు వచ్చాయి. మూసీ పరీవాహక ప్రాంతమైన బీబీనగర్, వలిగొండ, పోచంపల్లి, రామన్నపేటలో మాత్రం మూసీ నీటితో చెరువులు కాస్త కళకళలాడుతుండగా, ఇతర ప్రాంతాల చెరువులు మాత్రం అడుగంటిపోయాయి.

ఆత్మకూరు(ఎం) మండలంలోని కప్రాయపల్లి–మోదుగబావి మధ్యలో బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ నీళ్లు లేక ఇలా..

గతేడాది ఇదే సమయంలో కళకళలాడిన చెక్ డ్యామ్

నెమ్మదిగా సాగు పనులు

వానకాలం సీజన్‌కు సంబంధించి సాగు పనులు నెమ్మదిగా నడుస్తున్నాయి. వర్షాలు లేక, సాగు నీరు అందక పొలం పనులు ముందుకు సాగడంలేదు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4,59,850 ఎకరాల్లో సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 2,85,000 ఎకరాల్లో వరి, 1,35,000 ఎకరాల్లో పత్తి, 8500 ఎకరాల్లో పప్పు గింజలు, 200 ఎకరాల్లో మిల్లెట్లు, 150 ఎకరాల్లో ఆయిల్ సీడ్స్, 21,000 ఎకరాల్లో ఇతర పంటలు వేసే అవకాశం ఉందని భావించింది. కానీ జిల్లాలో ఇప్పటి వరకు 1.69 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. ఇందులో 1,00,514 ఎకరాల్లో పత్తి, 60,202 ఎకరాల్లో వరి వేశారు. వర్షాలు ఆలస్యం కావడంతో సీజన్ ఏ విధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో చెరువు ఆయకట్టు కింద కొద్ది మంది రైతులు మాత్రమే నాట్లకు సిద్ధం చేసిన పొలాలు

ఇక బోర్లు, బావులే దిక్కు..

వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి, భూములను సిద్ధం చేసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. మరికొన్ని చోట్ల విత్తనాలు వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొన్ని చోట్ల వరి పోసినా చేతికి రాకుండా పోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. పత్తి పంట వేసినా నీళ్లు లేక ఎండిపోతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో బోర్లు, బావులే ఆధారం కానున్నాయి. గత యాసంగి సీజన్‌లోనే అనేక చోట్ల సాగునీరు లేకపోవడంతో ట్యాంకర్లతో పోసిన ఘటనలు తెలిసిందే.

జిల్లాలో ఇదీ పరిస్థితి

- యాదగిరిగుట్ట మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో 25శాతం లోపు మాత్రమే నీళ్లు ఉన్నాయి. కొన్ని చెరువులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి.
- తుర్కపల్లి మండలంలో 130 చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటిల్లో 25శాతం లోపు మాత్రమే నీళ్లున్నాయి. వర్షాలు లేక కొన్ని చెరువులు పూర్తిగా ఎండిపోయే దశకు చేరుకున్నాయి.
- ఆత్మకూరు (ఎం) మండలంలోని సింగారం చెరువులో కొద్దిపాటి నీళ్లున్నాయి. మిగతా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేదు.
- భూదాన్ పోచంపల్లి మండలంలో మూసీ పరీవాహక ప్రాంతాల్లో కాల్వల ద్వారా నీటిని తీసుకొని వరి నాట్లు వేశారు. పూర్తి స్థాయిలో చెరువులు నిండలేదు. మెహర్‌నగర్, దోతిగూడెం, అంతమ్మగూడెం, జిబ్లక్‌పల్లి చెరువుల్లో కొంత వరకే నీళ్లున్నాయి.
- నారాయణపురం మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి.
- చౌటుప్పల్ మండలంలో ఇప్పటి వరకు విస్తారంగా వర్షాలు పడలేదు. దాంతో పత్తి పంట ఆరుబట్టే దశకు చేరుకుంది. దిగువ –ప్రాంతంలో బోర్లు అంతంత మాత్రంగానే పోస్తున్నాయి. పూర్తిస్థాయిలో నాట్లు కాలేదు.
- మోత్కూరు మండలంలో నార్లు పోసుకొని నెల రోజులు గడుస్తున్నా సరైన వర్షాలు లేక రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో 15 చెరువులు నీళ్లు లేక అడుగంటిపోయాయి.
- రామన్నపేట మండలంలో పూర్తి స్థాయిలో వర్షాలు కురవలేదు. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని చెరువుల్లో మాత్రమే నీళ్లు ఉన్నాయి.
- బొమ్మలరామారంలోని చెరువులు ఎండిపోయే దశలో ఉన్నాయి. బోర్ల కింద సాగు చేస్తున్నారు. నీళ్లు సరిపోక నాట్లు ఆలస్యం అవుతున్నాయి.
- ఆలేరు మండలంలో వర్షాలు లేక చెరువులు ఎండిపోయే దశలో ఉన్నాయి. నాట్లు ఇప్పుడిప్పుడే మొదలుపెడుతున్నారు.
- వలిగొండ మండలంలోని మూసీ యేతర గ్రామాలైన టేకుల సోమారం, పైల్వాన్‌పురం, కంచనపల్లి, పులిగిల్ల గ్రామాల్లో నీళ్లు లేక చెరువులు ఎండిపోయాయి.
- మోటకొండూరులోని చెరువులు ఎండిపోయే దశలో ఉన్నాయి. గతంలో పోలిస్తే సాగు కూడా తగ్గింది.
- బీబీనగర్ మండలంలో మూసీ పరీవాహక ప్రాంతం మినహా మిగిలిన ఎనిమిది గ్రామాల్లోని చెరువుల్లో 25 శాతంలోపే నీళ్లు ఉన్నాయి.
- గుండాల మండల వ్యాప్తంగా చెరువులు ఎండిపోయాయి. గతంలో నవాబ్‌పేట రిజర్వాయర్ ద్వారా చెరువులు నిండేవి. ఈ సారి సాగు కోసం నీటిని విడుదల చేయలేదు.

మఠంపల్లిలో ఏకాదశి వేడుకలకు ముస్తాబైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

నేడు తొలి ఏకాదశి.. మోహర్రం

రామగిరి, జూలై 16 : హిందూ, ముస్లింలకు పండుగ సంబురం కలిసి వచ్చింది. బుధవారం తొలి ఏకాదశి, మొహర్రం సందర్భంగా వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవస్థానాలు విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. నదీ జలాల్లో పుణ్యస్నానాలు చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. ఇక మొహర్రం నేపథ్యంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేయనున్నారు. ఇప్పటికే పీర్ల సందడి గ్రామాలు, పట్టణాల్లో కోలాహలంగా సాగుతున్నది.

చిట్యాలలో పీర్ల ఊరేగింపు

పారదర్శకంగా ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

- అదనపు కలెక్టర్లు పి.బెన్షాలోమ్, కె.గంగాధర్

కౌన్సిలింగ్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు పి.బెన్షాలోమ్, కె.గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, జూలై 16 : పారదర్శకంగా ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతుందని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్లు పి.బెన్షాలోమ్, కె.గంగాధర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జూనియర్ అసిస్టెంట్ నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు 12 శాఖలకు (విద్యా, వ్యవసాయ, పంచాయతీరాజ్, సహకార, మహిళా శిశు సంక్షేమ, ట్రెజరీ, బీసీ సంక్షేమ, మార్కెటింగ్, వైద్యారోగ్య, పశుసంవర్ధక, గిరిజన సంక్షేమ, రోడ్లు భవనాలు) సంబంధించిన ఉద్యోగులకు బదిలీల కౌన్సిలింగ్ చేపట్టారు. కౌన్సిలింగ్‌లో కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి భగత్, ఎండీ ఖదీర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో పలు రైళ్ల స్టాప్ ఎత్తివేత

విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ఏడాది మాత్రమే అనుమతి ఇచ్చిన రైల్వే శాఖ

మిర్యాలగూడలో ఆగిన రైలు

మిర్యాలగూడ, జూలై 16 : సికింద్రాబాద్– గుంటూరు మార్గంలో ప్రయాణించే విశాఖ, చెన్నై, గుంటూరు మార్గంలో ప్రయాణించే విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లలో ఈ నెల 19 నుంచి స్టాప్‌ను మళ్లీ ఎత్తివేస్తున్నట్లు రైల్వే శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కరోనా సమయంలో ఈ రైళ్లకు స్టాప్‌లు ఎత్తివేయడంతో రెండేండ్ల పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో మాజీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడలో రైళ్లు నిలపాలంటూ రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గతేడాది జూలై నుంచి ఆయా రైళ్లను మిర్యాలగూడతోపాటు నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో ఒక నిమిషం పాటు ఆగేలా అనుమతించారు. ఆదేశాలు ఇచ్చిన సమయంలోనే ఏడాదిపాటు రైళ్లు నిలుపుతామని ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రస్తుతం ఏడాది సమయం పూర్తికావడంతో ఈ నెల 19 నుంచి ఆయా స్టాప్‌లను రైల్వే అధికారులు ఎత్తివేశారు. ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది ప్రయాణికులు సికింద్రాబాద్– గుంటూరు మార్గంలో ఆంధ్రప్రదేశ్, ఒడిషా వంటి ప్రాంతాలకు వెళ్తుంటారు. రైల్వే అధికారుల నిర్ణయంతో తాము తీవ్ర ఇబ్బందులు పడతామని, మిర్యాలగూడలో రైళ్లను నిలిపేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

రేపటి నుంచి డీఎస్సీ

- నల్లగొండ ఎస్‌పీఆర్ పాఠశాలలో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం
- ప్రతి సెషన్‌లో 185 మంది అభ్యర్థులు

రామగిరి, జూలై 16 : రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు జరుగనున్నాయి. తొలి పర్యాయం ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశాల ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ఎగ్జామ్ ఉంటుందని డీఈఓ భిక్షపతి వెల్లడించారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల రెండు సెషన్‌లలో పరీక్షలు జరుగనున్నాయి.

ఇవి తప్పనిసరి

- టీజీ డీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్లు తీసుకురావాలి.
- ఆధార్ కార్డు, పాన్ కార్డు లేదా ఇతర ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డులు వెంట తెచ్చుకోవాలి.
- అభ్యర్థుల వెంట ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్లోకి అనుమతించరు.
- హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో ప్రింట్ కానట్లయితే పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలి.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

ఆలేరు రూరల్, జూలై16 : ఒకటో తరగతి నుంచి పీజీ చదివే బీడీ కార్మికుల పిల్లలకు యేటా నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ ద్వారా కేంద్ర కార్మిక శాఖ ఉపకార వేతనం అందిస్తుందని ఆలేరు బీడీ కార్మిక సంక్షేమ శాఖ దవాఖాన మెడికల్ ఆఫీసర్ నిఖిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 అకాడమిక్ సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి కేంద్ర కార్మిక శాఖ ప్రకటన జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రీ మెట్రిక్ కేటగిరీలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 31 వరకు.. పోస్ట్‌మెట్రిక్ కేటగిరీలో 11వ తరగతి నుంచి పైబడిన కోర్సులు చదివే విద్యార్థులకు అక్టోబర్ 31వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు స్కాలర్ షిప్ పోర్టల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు అడుగులు

- విద్యార్థులకు డ్రగ్స్ చేరకుండా చర్యలు
- హైస్కూళ్లలో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్న విద్యాశాఖ
- ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులకు అవకాశం
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులతో కమిటీ

సూర్యాపేట అర్బన్, జూలై 16 : రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పాఠశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్‌లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు చేశారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం నుంచి పిల్లలను ప్రహరీ క్లబ్‌లు కాపాడనున్నాయి. ప్రతి కమిటీలో ఆరుగురు సభ్యులను వివిధ స్థాయిలో ఉన్న వారిని నియమించనున్నారు. సూర్యాపేట జిల్లాలో ఏడు వందలకుపైగా హైస్కూళ్లు ఉన్నాయి.

ప్రహరీ క్లబ్ సభ్యులు

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షులుగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్‌ను ఎన్నుకుంటారు. వైస్ ప్రెసిడెంట్‌గా సీనియర్ టీచర్ లేదా ప్రెండ్లీ టీచర్‌ను నియమిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలోని ఇద్దరు విద్యార్థులు, స్థానికంగా ఉంటే పోలీస్ స్టేషన్ నుంచి ఒక అధికారి, పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్‌లో సభ్యులుగా ఉంటారు.

త్వరలో మార్గదర్శకాలు

ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రహరీ క్లబ్‌లకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్నది.

ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో కమిటీల ఏర్పాటు పూర్తయ్యేలోపు ప్రభుత్వం సూచించే మార్గదర్శకాలను అమలు చేసేందుకు సిద్ధం కానున్నారు.

కమిటీల లక్ష్యం

పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు, ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ ప్రహరీ క్లబ్‌లు పనచేయనున్నాయి. ఇప్పటికే డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదంతో అణగదొక్కుతున్న ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసే ప్రహరీ క్లబ్‌ల సహకారంతో పోలీస్ అధికారులు మరిన్ని దాడులు నిర్వహించనున్నాయి. రానున్న రోజుల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల జిల్లాగా మార్చేందుకు సహకారం అందించనున్నాయి.

కమిటీల కోసం ఆదేశాలు వచ్చాయి

కమిటీలకు సంబంధించి విద్యాశాఖ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలోని అన్ని మండలాధికారులకు సమాచారం అందించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీలను ఏర్పాటు చేసి అమలు చేస్తాం. స్థానికంగా ఉన్న పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కమిటీల్లో వారి సూచనలు తీసుకుంటాం.

-అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి, సూర్యాపేట

డ్రగ్స్ రహిత జిల్లాగా మారాలి

పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన లేక డ్రగ్స్ బారిన పడి వాటికి బానిసలవుతున్నారు. డ్రగ్స్ నియంత్రణకు కమిటీలను ఏర్పాటు చేసి పకడ్బందీగా అమలు చేయాలి. ఇందులో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి వారి సలహాలు, సూచనలు తీసుకోవడం మంచి పరిణామం. ఈ కమిటీల ద్వారా డ్రగ్స్ రహిత జిల్లాగా మారేందుకు అవకాశం ఉంటుంది.

-కె. ధనుంజయ చారి, పేరెంట్, సూర్యాపేట